సాక్షి
జనగామ
సోమవారం । 18 సెప్టెంబర్ । 2023



‘లయన్స్’ సేవలు అభినందనీయం - 9లో ▸

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు.



పల్లెలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి - 9లో ▸

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీపీ నాగజ్యోతి అన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా గ్రామంలో శ్రమదానం నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం
31.5⁰ /26.0⁰

వాతావరణం

జిల్లాలో వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి. సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పల్లగుట్ట వాసికి నంది అవార్డు



చిల్పూరు: మండలంలోని పల్లగుట్ట గ్రామానికి చెందిన కేశోజు రాంబ్రహ్మాచారి హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో నంది అవార్డు అందుకున్నాడు. గ్రామానికి చెందిన బ్రహ్మాచారి షిర్డీ సాయి జ్యోతిష్యాలయం పురోహితుడిగా పనిచేస్తున్నాడు. విశ్వకర్మ జయంతి సందర్భంగా వల్లూరి ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాస రాజు, మాజీ మంత్రి వేణుగోపాలచారి చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుపై ప్రకటన చేయాలి



జనగామ రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లుపై అమిత్‌షా ప్రకటన చేయాలని, వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లుకు ఆమోదం తెలపాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ మాదిగ అన్నారు. ఆదివారం జనగామ చౌరస్తాలో చేపడుతున్న దీక్షలు 9వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగలు ఏళ్ల తరబడి ఆశగా ఎదురుచూస్తున్న వర్గీకరణ బిల్లు పెట్టి అమలు చేయడం బీజేపీ నైతిక ధర్మం అన్నారు. హైదరాబాద్ కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సమావేశంలో బిల్లుపై చర్చించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోట్ల మహేష్, అనిల్, ఇస్సాక్, హరికృష్ణ, సురేష్, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ కళ ద్వారా గణపతి ఆకృతులు..



కాటారం: చాక్‌పీస్‌లు, పెన్సిల్ గ్రాఫైట్‌లపై అతిసూక్ష్మ ఆకృతులు రూపొందించి అబ్బురపరుస్తున్నారు ఓ ఆర్ట్ ఉపాధ్యాయుడు. సందర్భానికి అనుగుణంగా.. కార్యక్రమ విశిష్టతను తెలియజేసేలా చిన్న ఆకృతులు తయారు చేసి కళానైపుణ్యం చాటుకుంటున్నారు మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల ఆర్ట్ ఉపాధ్యాయుడు ఆడెపు రజనీకాంత్. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చాక్‌పీస్‌పై పది మిల్లీమీటర్ల ఎత్తు, ఆరు మిల్లీమీటర్ల వెడెల్పు ఉన్న గణపతి నమూనాను తయారు చేశారు. గుండు పిన్ను సాయంతో మూడు గంటలు శ్రమించి ఈ ఆకృతిని రూపొందించారు. అలాగే, పెన్సిల్ గ్రాఫైట్‌పై 1.8 మిల్లీమీటర్ల ఎత్తు, 1.2 మిల్లీమీటర్ల వెడెల్పు ఉన్న బుజ్జి గణపతిని, మూడు సెంటీమీటర్ల ఎత్తున్న చెడు వినకు.. చెడు చూడకు.. చెడు మాట్లాడకు అనే రూపంలో గణపతి ఆకృతులను తయారు చేశారు. నాలుగు గంటలు శ్రమించి 3.5 సెంటీమీటర్ల ఎత్తున్న నిల్చున్న గణనాథుడి విగ్రహాలను ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌పై చెక్కి ప్రజలకు గణపతి నవరాత్రి ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. రజనీకాంత్ గతంలో పెన్సిల్ గ్రాఫైట్‌పై అతి చిన్న గణనాథుని ప్రతిమను చెక్కి బుక్ ఆఫ్ స్టేట్ రికార్డ్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డుతో పాటు, ఆర్.హెచ్.ఆర్ వరల్డ్ రికార్డు, సృజనపుత్ర అవార్డులను సొంతం చేసుకొన్నారు. అబ్బురపరిచే రజనీకాంత్ కళా నైపుణ్యతను చూసి పలువురు రజనీకాంత్‌కు అభినందనలు తెలిపారు.

మల్లన్న ఆలయంలో కన్యాసంక్రమణ పూజలు



ఐనవోలు: సూర్యుడు కన్య రాశిలోకి ప్రవేశించిన సందర్భంగా ఐనవోలు శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం నిత్య కైంకర్యాల అనంతరం కన్యాసంక్రమణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం చేశారు. గొల్ల కేతమ్మ, బలిజ మేడలమ్మ సమేత శ్రీమల్లికార్జునస్వామి కల్యాణం శైవాగమోక్తంగా చేపట్టారు. అలాగే ఒగ్గు పూజారులు గర్భాలయం ఎదుట మహా మండపంలో నజరు పట్నం వేసినట్లు ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు ఐనవోలు మధుకర్ శర్మ, వేద పారాయణ దారు గట్టు పురుషోత్తమ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్యంలోకి..

దేశభక్తి భావన పెల్లుబికేలా వజ్రోత్సవాలు
- కొనసాగింపుగానే జాతీయ సమైక్యతా దినోత్సవం
- నాటి యోధుల త్యాగాలను తలచుకోవడం మన బాధ్యత
- జాతీయ సమైక్యతా వేడుకల్లో మంత్రి దయాకర్‌రావు



జాతీయ జెండాకు వందనం చేస్తున్న మంత్రి దయాకర్‌రావు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న మంత్రి



వేదికపై మంత్రి, ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్, కలెక్టర్, ప్రజాప్రతినిధులు



జనగామ: రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్యంలోకి తెలంగాణ అడుగు పెడుతూ దేశంలో అంతర్భాగంగా కలిసిన చరిత్రను మరోసారి గుర్తుకు చేసుకోవడం సంతోషకరమని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం కలెక్టరేట్‌లో జరిగిన వేడుకల్లో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అంతకుముందు మంత్రి జాతీయజెండాను ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో దేశ భక్తి భావన పెల్లుబికేలా వజ్రోత్సవాలు జరుపుకున్నామని, దీనికి కొనసాగింపుగానే జాతీయ సమైక్యతా దినోత్సవాలు నిర్వహించుకుంటున్నామన్నారు. తెలంగాణ సాయుధ పోరాట సమయంలో స్వేచ్ఛ కోసం ఆనాటి యావత్ సమాజం ఉవ్వెత్తున ఉద్యమించిందన్నారు. యోధుల త్యాగాలను గుర్తుకు చేసుకోవడం మనందరి బాధ్యతగా భావించాలన్నారు. ఆదివాసీ యోధుడు కొమురంభీం, దొడ్డి కొమురయ్య పోరాటానికి నాయకత్వం వహించిన మహనీయులు రావి నారాయణ రెడ్డి, స్వామి రామానంద తీర్థ, భీంరెడ్డి నర్సింహారెడ్డి, చాకలి ఐలమ్మ, ఆరుట్ల రామచంద్రారెడ్డి, కమలాదేవి, బొమ్మగాని ధర్మభిక్షం గౌడ్, దేవులపల్లి వెంకటేశ్వర్‌రావు, బద్దం ఎల్లారెడ్డి, ప్రజా గెరిల్లా పోరాట యోధుడు, నిఖార్సైన యుద్ధ వీరుడు నల్లా నర్సింహులు వంటి ప్రజానేతల త్యాగాలను సగర్వంగా స్మరించుకోవాలన్నారు. 76 ఏళ్ల స్వతంత్ర భారతంలో తెలంగాణ 60 సంవత్సరాల పాటు అస్తిత్వం కోసం ఉద్యమించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డి, కలెక్టర్ శివలింగయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి, డీసీపీ సీతారాం, అదనపు కలెక్టర్లు రోహిత్ సింగ్, సుహాసిని, ఆర్డీఓ మురళీ కృష్ణ, ఏసీపీ దేవేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ నిమ్మతి దీపిక, ఏఎంసీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జల్లి సిద్దియ్య, డీపీఓ రంగాచారి, డీఆర్డీఓ రాంరెడ్డి, డీఏఓ వినోద్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కొర్నేలియస్, డీఈఓ రామ్, సీపీఓ ఇస్మాయిల్, కౌన్సిలర్లు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మైత్రేయి కూచిపూడి కళాక్షేత్రం, సెయింట్ పాల్స్, ఎస్‌పీఆర్ కేజీబీవీ (లింగాలఘనపురం), సెయింట్ మేరీస్ స్కూల్ విద్యార్థుల ప్రదర్శన అలరించింది. మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్ ఉన్నతాధికారులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

ప్రసంగ పాఠంలో కనిపించని ‘నల్లా’ పేరు..

అధికారులు ఇచ్చిన ప్రసంగ పాఠంలో తెలంగాణ సాయుధ పోరాటంలో గెరిల్లా తరహా ఉద్యమం చేసిన ఉద్యమకారుడు నల్లా నర్సింహులు పేరు లేకపోవడం ఆశ్చర్యం కలిగించింది. కానీ మంత్రి తన ప్రసంగంలో నర్సింహులు త్యాగాలను గుర్తుచేశారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

స్టేషన్‌ఘన్‌పూర్: పూలు, పత్రి విక్రయిస్తున్న మహిళలు



ఉత్సవాలకు ముస్తాబు

- నేడు వినాయక చవితి



దేవరుప్పుల: సిద్ధమైన మండపం

దేవరుప్పుల/స్టేషన్‌ఘన్‌పూర్: ఆదిదేవుడిని కొలిచే ప్రత్యేకతను సంతరించుకున్న వినాయక చవితిని పురస్కరించుకుని నేటి (సోమవారం) నుంచి తొమ్మిదిరోజుల పాటు ఉత్సవాలు జరిపేందుకు ఊరూరా.. వాడవాడలా మండపాలు అన్ని హంగులతో సర్వం సిద్ధం చేశారు. గణేష్ ఉత్సవ సమితి, భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకలకు పోలీసు యంత్రాంగం తగు అనుమతుల మేరకు ఉత్సవాలు నిర్వహించుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో పలు పార్టీల నేతలు యువతను ఆకట్టుకునేందుకు పోటీపడి ప్రతిమలను అందజేశారు. గణనాథుడి పూజ కోసం వినియోగించే వివిధ రకాల పూలు, పత్రులను వినియోగించేవారితో జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లో సందడి నెలకొంది.

బైపాస్ రోడ్డుతో మారనున్న రూపురేఖలు

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



బైపాస్ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జనగామ: బైపాస్ రోడ్డుతో జనగామ జిల్లా కేంద్రం మరింత విస్తరించడంతో పాటు రోడ్డు రవాణా పరంగా అభివృద్ధికి దోహదపడుతుందని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగి రిరెడ్డి అన్నారు. పట్టణంలోని బాణాపురం శివారు జంక్షన్ వద్ద పెంబర్తి క్రాస్ రోడ్డు, పసరమడ్ల అనాథ వృద్ధాశ్రమం సమీపం వరకు (జాతీయ రహదారి వరకు) నూతనంగా నిర్మాణం చేయనున్న బైపాస్ రోడ్డు పనులకు ఆదివారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణం చుట్టూ రింగ్ రోడ్డు, బైపాస్ నిర్మాణంతో జనగామ మహర్దశ మారి పోనుందన్నారు. ఏడాదిలోగా బైపాస్ రహదారి నిర్మాణ పనులను పూర్తి చేసేలా ప్రణాళిక చేయడం జరిగిందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో జిల్లాను వందశాతం అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ బాల్దె సిద్దిలింగం, నేషనల్ హైవే డీఈ కిరణ్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలు జరిగితే అభ్యర్థుల మార్పు

- ఆరు నూరైనా ప్రజాక్షేత్రంలోనే ఉంటా..
- ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

రఘునాథపల్లి: టికెట్ రాదని ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.. జమిలి ఎన్నికలు వస్తే అభ్యర్థుల మార్పు తప్పనిసరిగా ఉంటుందని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. ఆదివారం రఘునాథపల్లి మండలం అశ్వరావుపల్లి నుంచి వీరారెడ్డి తండాకు బీటీ రోడ్డు, గబ్బెటలో సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అశ్వరావుపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 22 వరకు జరిగే పార్లమెంట్ సమావేశాల్లో అసెంబ్లీ ఎన్నికలపై స్పష్టత వస్తుందని, జమిలి ఎన్నికలు జరిగే అవకాశముందని మంత్రి కేటీఆర్ చెప్పినట్లు పేర్కొన్నారు. ‘అటుది ఇటు అయితది.. ఎటైనా అయితది.. ఆరు నూరైనా ప్రజాక్షేత్రంలోనే ఉంటా.. నాకు మంచి రోజులు వస్తున్నాయని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చెప్పారు.. నాయకులు, కార్యకర్తలు సంయమనంతో ఉండాలి.. అంతా మంచే జరుగుతుంది’ అని అన్నారు. సర్పంచ్ సురేందర్‌రెడ్డి, జెడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు బొల్లం అజయ్, బీఆర్ఎస్ నాయకులు కుమార్‌గౌడ్, వారాల రమేష్, ఎంపీటీసీలు సుల్తాన్ దేవేందర్‌రెడ్డి, శాగ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దేవరుప్పుల: ఎస్‌ఈఆర్‌టీ సెమినార్, స్టేట్ సైన్స్ కాంగ్రెస్‌కు సింగరాజుపల్లి హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం కళావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న మిల్లెట్స్‌పై జరిగిన జిల్లా స్థాయి సెమినార్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం తెలిపారు. ఈ నెల 19న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సెమినార్‌లో బి.వైష్ణవి పాల్గొననుంది. అలాగే కె.చరిత, బి.సాహితి కూడా రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. సైన్స్ టీచర్ నిరంజని, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ మల్లేశ్, బుచ్చిరెడ్డి, మోహన్‌లు విద్యార్థులను అభినందించారు.



పాకాలలో పర్యాటకుల సందడి

ఖానాపురం: వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని పాకాలలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు నర్సంపేట, ఖానాపురం మండలాల ప్రజలు పాకాలలో ఉత్సాహంగా గడిపారు. పలువురు వనభోజనాలకు తరలివచ్చి కట్టమైసమ్మ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మత్తడి ప్రదేశం వద్ద జలకాలాడుతూ కేరింతలు కొట్టారు.

అందరి కృషి ఫలితమే అవార్డులు

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- జిల్లాలోని 40 జీపీలకు స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డులు
- జాతీయ స్థాయికి రెండు గ్రామాల ఎంపిక



అవార్డు అందుకుంటున్న బచ్చన్నపేట సర్పంచ్

- మరిన్ని అవార్డు చిత్రాలు 8లో ▸

జనగామ: రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలువగా స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్‌లో రికార్డు స్థాయిలో వచ్చిన అవార్డులు మనలోని అంకిత భావానికి నిదర్శనంగా నిలుస్తున్నాయని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్-2023లో భాగంగా జిల్లాలోని 40 గ్రామ పంచాయతీలకు జిల్లా స్థాయి, ఎస్‌బీఎం పరిధిలో ఓవర్ యాక్టివిటీస్ కేటగిరీల్లో అవార్డులు రాగా ఆదివారం కలెక్టరేట్‌లో మంత్రి చేతుల మీదుగా అందించారు. అనంతరం మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రగతిని తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సుస్థిర పారిశుద్ధ్య సర్వే చేపట్టిందన్నారు. లింగాలఘనపురం మండలం సిరిపురం, జఫర్‌గఢ్ మండలం కూనూరు గ్రామాలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షనీయమన్నారు.

అవార్డులు, ప్రశంసపత్రాలు

స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ అవార్డుల జాబితాలో 2వేల జనాభా కలిగిన పంచాయతీలు-9, 5వేల జనాభా లోపు-16, 5వేల పైబడి గ్రామాలు-6, ఎస్‌బీఎంలో ఓవరాల్ యాక్టి విటీస్-9 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 2వేల లోపు జనాభా కేటగిరీలో బచ్చన్నపేట మండలంలోని నాగిరెడ్డిపల్లి, తమ్మడపల్లి, దేవరుప్పుల మండలం చౌడూరు, లింగాలఘనపురం మండలంలోని సిరిపురం, కొడకండ్ల మండలంలోని రామన్నగూడెం, రంగాపురం, నర్మెట మండలంలోని బొమ్మకూరు, రఘునాథపల్లి మండలంలోని ఇబ్రహీంపూర్, శ్రీమన్నారాయణపురం, 5 వేలపు జనాభా పరిధిలో బచ్చన్నపేట కట్కూరు, ఇటికాలపల్లి, దేవరుప్పుల మండలకేంద్రం, జనగామ మండలంలోని ఎల్లంల, పెంబర్తి, వెంకిర్యాల, కొడకండ్ల మండలంలోని మొండ్రాయి, లింగాలఘనపురం మండలంలోని కళ్లెం, నర్మెట మండలంలోని అమ్మాపూర్, మచ్చుపహాడ్, పాలకుర్తి మండలంలోని ఈరవెన్ను, దర్దెపల్లి, తరిగొప్పుల మండలంలోని అంకుషాపూర్, జఫర్‌గఢ్ మండలంలోని ఉప్పుగల్, తీగారం, కూనూరు పంచాయతీలు జిల్లా స్థాయి అవార్డులను గెలుచుకున్నారు. 5వేలపై బడిన జనాభా కేటగిరీలో బచ్చన్నపేట మండలకేంద్రం, స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రం, జనగామ మండలం వడ్లకొండ, కొడకండ్ల మండల కేంద్రం, పాలకుర్తి మండలంలోని గూడూరు, జఫర్‌గఢ్ మండల కేంద్రం ఉత్తమంగా నిలిచాయి. ఎస్‌బీఎం ఓవరాల్ యాక్టివిటీస్‌లో బచ్చన్నపేట మండలంలోని కొడవటూరు, వీఎస్‌ఆర్‌నగర్, చిల్పూరు మండలంలోని శ్రీపతిపల్లి, చిల్పూరు, దేవరుప్పుల మండలంలోని బంజెర, కడవెండి, నల్లకుంట తండా, జనగామ మండలంలోని శామీర్‌పేట, పాలకుర్తి మండలంలోని తీగారం గ్రామపంచాయతీలు ఉన్నాయి. డీపీఓ రంగాచారి, డీఆర్డీఓ రాంరెడ్డి, ఎస్‌బీఎం కర్ణాకర్, సర్పంచ్, ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శి తదితరులకు శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందించారు. అక్టోబర్ 2వ తేదీన కేంద్రం ఇచ్చే అవార్డుల్లో రాష్ట్రానికి మరిన్ని అవార్డు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి



పాలకుర్తి టౌన్: అర్చక ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తారని హామీ ఇచ్చినట్లు రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ కన్వీనర్ డీవీఆర్ శర్మ తెలిపారు. ఈ మేరకు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీఎం కేసీఆర్‌ను కలిసి అర్చక ఉద్యోగుల సమస్యలను వివరించారు. దేవాదాయ శాఖ మంత్రి, అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు డీవీఆర్‌శర్మ తెలిపారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ జయంతిలో పాల్గొన్న అదనపు కలెక్టర్, ఎమ్మెల్యే

జనగామ రూరల్: శ్రీమద్విరాజ్ విశ్వకర్మ జయంతి మహోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్ ఐడీఓసీ కార్యాలయంలో బీసీ సంక్షేమాధికారి బి. రవీందర్ అధ్యక్షతన ఘనంగా విశ్వకర్మ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి హాజరై మాట్లాడుతూ విశ్వకర్మలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. అంతకు ముందు పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోకల జమున, మార్కెట్ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, సంఘం నాయకులు రామేశ్వరా చారి, అంజనేయులు, దిగోజు సాంబయ్య, నర్సింహాచారి, మంజుల, గంగా భవాని తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం, స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించి మహాయజ్ఞం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దిగోజు సాంబయ్య చారి, బత్తోజు సిద్ధిరాములు, ఆకోజే అంజనేయులు, పాన్నోజు రత్నాచారి, రాజు, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్



జనగామలో ర్యాలీ తీస్తున్న సీపీఎం నాయకులు

జనగామ రూరల్: అనాటి సాయుధ పోరాట స్ఫూర్తితో బూర్జువ భూస్వామ్య పార్టీలను ఓడించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ అన్నారు. ఆదివారం సాయుధ వారోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అబ్బాస్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టే అన్నారు. రాబోయే ఎన్నికల్లో మతతత్వ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, అహల్య, రాపర్తి సోమయ్య, జోగుప్రకాష్, రమేష్, గోపి, ఉపేందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


కొడవటూరు సర్పంచ్‌కు అవార్డు అందజేస్తున్న మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్యే


స్టేషన్‌ఘన్‌పూర్ సర్పంచ్..


వీఎస్‌ఆర్‌నగర్ సర్పంచ్..


పెంబర్తి సర్పంచ్‌కు..


ఎల్లంల సర్పంచ్..


వడ్లకొండ సర్పంచ్..


సిరిపురం సర్పంచ్..


బొమ్మకూరు సర్పంచ్..


తీగారం సర్పంచ్..


కడవెండి సర్పంచ్...

గణనాథుని పూజించండి... సిరిసంపదలతో తులతూగండి

- Advt Feature


మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం..

వినాయకుడు




వినాయకుడంటే భౌతికంగా మనకు కనిపించే ఆకారం మాత్రమే కాదు.. ఆయన రూపు, స్వభావం వెనుక లోతైన అర్థం ఉందని వేదాంతులు చెబుతుంటారు. గణేశుని ఆరాధనతో బాధల నుంచి సులభంగా విముక్తి పొంద వచ్చని సూచిస్తుంటారు. అందుకే గణేశుడే ప్రముఖంగా ఆరాధించబడే గాణపత్యం అనే శాఖ కూడా ఉంది. వినాయకుని ఆరాధనలో ఆధ్యాత్మిక రహస్యాలు ఎన్నో ఉన్నాయని చెప్పేందుకు ఓ గొప్ప ఉదాహరణ ఆయన అవతారాలు. ముద్గల పురాణం ప్రకారం వినాయకుడు ఎనిమిది అవతారాలను ధరించాడు. ఆ ఎనిమిది అవతారాల వివరాలను, గణనాథుని మహిమలను తెలుసుకుని ఆ వినాయకుని సేవించి తరిద్దాం.

వక్రతుండుడు



పూర్వం ఇంద్రుడు చేసిన ఒక పొరపాటు వల్ల 'మాత్సర్యాసురుడు' అనే రాక్షసుడు ఉద్భవించాడు. అతని ధాటికి ముల్లోకాలూ అల్లాడిపోయి దేవతలంతా దత్తాత్రేయుని శరణు వేడారు. అంతట దత్తాత్రేయుడు, గణపతిని ప్రార్థించమని సూచించాడు. 'గం' అనే బీజాక్షరంతో దేవతలంతా ఆ గణపతిని గురించి తపస్సు చేయగానే 'వక్రతుండుని'గా అవతరించాడు. ఆయన సింహవాహనుడై ఆ మాత్సర్యాసురుని జయించాడు. వక్రతుండం అనేది ఓంకారానికి ప్రతీకగా, మాత్సర్యాసురుడు మనలోని మత్సరానికి (ఈర్ష్య) ప్రతీకగా చెప్పుకోవచ్చు. ఈ లోకం నాది, ఈ లోకంలో అందరికంటే నాదే పైచేయి కావాలి అనుకున్న రోజున ఈర్ష్యాసూయలు జనిస్తాయి. ఈ జగత్తు ఒక నాటకం మాత్రమే అని గ్రహించిన రోజున మనసులో ఎలాంటి ఈర్ష్య ఉండదు.


ఏకదంతుడు




చ్యవనుడనే రుషి మదాసురుడనే రాక్షసుని సృష్టించాడు. రాక్షసుల గురువైన శుక్రాచార్యుడు అతనికి 'హ్రీం' అనే మంత్రాన్ని ఉపదేశించి నిరంతరం జపిస్తే ఫలితం దక్కుతుందన్నాడు. లోకాధిపత్యమే అభీష్టంగా గల మదాసురుడు ఆ హ్రీంకారాన్ని యుగాల తరబడి జపించాడు. దాంతో అతనికి కోరుకున్న శక్తులన్నీ లభించి మదాసురునికి తిరుగులేకుండాపోయింది. అతని చేష్టలకు దేవతలంతా భీతిల్లిపోయి సనత్కుమారుని చెంతకు ఉపాయం కోసం పరుగులు తీశారు. సనత్కుమారుని సూచన మేరకు వారంతా గణేశుని కోసం ప్రార్థించగా, ఆయన 'ఏకదంతు'నిగా అవతరించి మదాసురిని జయించాడు. ఇక్కడ మదాసురుడు అంటే మదానికి (గర్వం) చిహ్నం, ఏకదంతుడు ఈ సృష్టి యావత్తూ ఒకటే అన్న అద్వైతానికి చిహ్నం.








మహోదరుడు




శివుడు ఓసారి తీవ్రమైన తపస్సులో మునిగిపోయాడు. ఎంత కాలమైనా ఆయన ఆ తపస్సుని వీడకపోవడంతో పార్వతి కంగారు పడి పరమేశ్వరుని తపస్సు నుంచి బయటకు తీసుకురావాలని గిరిజన యువతిగా మారి ఆయన తపోభంగం కలిగించే ప్రయత్నం చేసింది. పార్వతి చేష్టలకు పరమేశ్వరునికి దిగ్గున మెలకువ వచ్చి ఏం జరిగింది అన్న అయోమయం కూడా ఏర్పడి ఓ రాక్షసుడు జనించాడు. అతనే మోహాసురుడు. ఆ మోహాసురుడు సూర్యుని ఆరాధించి ముల్లోకాధిపత్యాన్ని సాధించాడు. దేవతల ప్రార్థనను మన్నించి గణేశుడు లంబోదరునిగా అవతరించాడు. మోహం ఎప్పుడూ అయోమయానికి దారితీస్తుంది. దృక్పథం సంకుచితంగా మారిపోతుంది. అందరూ నావారే అన్న విశాలమైన దృష్టి కలిగిన రోజున ఆ మోహం దూరమైపోతుంది.

గజాననుడు



కుబేరుని ఆశ నుంచి లోభాసురుడు అనే రాక్షసుడు జనించాడు. శివపంచాక్షరిని జపించిన ఆ లోభాసురుడు, శివుని అనుగ్రహంతో ముల్లోకాలనూ జయించే వరాన్ని పొందాడు. కానీ అతని లోభానికి అంతులేకుండా పోయింది. చివరికి శివుని కైలాసాన్ని కూడా తన స్వాధీనంలోకి తెచ్చుకోవాలనుకున్నాడు. ఆ విషయాన్ని తెలుసుకున్న దేవతలు రైభ్యుడనే రుషిని శరణువేడారు. గణపతిని కనుక ఆవాహన చేస్తే, లోభాసురుని పరాజయం ఖాయమని సూచించాడు. అలా సకల దేవతల ప్రార్థనలను మన్నించి గణేశుడు 'గజాననుడి'గా అవతరించి లోభాసురుని జయించాడు. గజాననుడు అంటే ఏనుగు ముఖం కలిగినవాడు అని అర్థం. ఏనుగు తల బుద్ధిని సూచిస్తుంది. ఆ బుద్ధిని కనుక ఉపయోగిస్తే మనలోని లోభం (అత్యాశ, పిసినారితనం) దూరం కాకతప్పదు.

లంబోదరుడు



దేవ, రాక్షసులు కలిసి సాగరాన్ని మథించినప్పుడు చివరగా అమృతం దక్కిన విషయం తెలిసిందే! ఈ అమృతాన్ని రాక్షసులకు కాకుండా చేసేందుకు విష్ణుమూర్తి మోహినీ అవతారాన్ని ధరించాడు. మోహిని రూపంలో ఉన్న విష్ణుమూర్తిని చూసిన శివునికి కూడా మనసు చలించగా విష్ణువు తన నిజరూపంలోకి రావడంతో శివుడు భంగపడి క్రోధితుడయి క్రోధాసురుడు అనే రాక్షసుడు జనించాడు. సూర్యదేవుని ఆశీస్సులతో మహాబలవంతుడయ్యాడు. క్రోధాసురుడు ప్రీతి అనే కన్యను వివాహమాడగా హర్షం, శోకం అనే సంతానం కలిగారు. వినాయకుడు లంబోదరుని రూపంలో క్రోధాసురుడిని అణచివేశాడు. క్రోధం ఎప్పుడూ తాను ఇష్టపడిన దాని కోసం వెంపర్లాడుతుంది. ఆ వెంపర్లాటలో గెలిస్తే హర్షం, ఓడితే శోకం అనే ఉద్వేగాలు కలుగుతాయి.








వికటుడు




పూర్వం కామాసురుడనే రాక్షసుడు ఉండేవాడట. ఆ కామాసురుడు శివుని గురించి ఘోర తపస్సు చేసి ముల్లోకాధిపత్యాన్ని సాధించాడు. అతని బారి నుంచి కాపాడే ఉపాయం సెలవిమ్మంటూ దేవతలంతా ముద్గల మహర్షిని వేడుకున్నారు. అంతట ఆ రుషి తదేక దీక్షతో ఓంకారాన్ని జపిస్తూ ఉంటే కనుక ఆ గణేశుడు ప్రత్యక్షమై వారి కష్టాన్ని తీరుస్తాడని సెలవిచ్చాడు. ముద్గలుని ఉపాయం పాటించిన దేవతలకు గణేశుడు వికటునిగా ప్రత్యక్షం అయ్యాడు. గణేశుని రూపు కాస్త విభిన్నంగా ఉంటుంది. అది ఒకోసారి ఓంకారాన్ని కూడా తలపిస్తుందని చెబుతారు. ఆ ఓంకార స్వరూపంతో కామాన్ని ఎదుర్కోవచ్చుననీ వికటుని వృత్తాంతం తెలియచేస్తోంది.

విఘ్నరాజు



కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యాలనే అరిషడ్వర్గాలకు ప్రతీకగా ఇప్పటివరకూ రాక్షసులని చూశాము. ఇక మమతాసురుడు అనే రాక్షసుని కథ ఇది. శంబరుడు అనే రాక్షసుని ప్రలోభంతో మమతాసురుడు ముల్లోకాలనూ పీడించసాగాడు. దేవతల కోరిక మేరకు వినాయకుడు, విఘ్నరాజుగా అవతరించి మమతాసురుని సంహరించాడు. చిత్రంగా ఈ అవతారంలో వినాయకుడు నాగుపాముని వాహనంగా చేసుకున్నట్లు చెబుతారు. ఇక్కడ మమత అంటే దేహాభిమానానికి ప్రతీక. ఆ దేహంలోని కుండలిని జాగృతం చేసిన రోజున మోక్షానికి గల విఘ్నాలన్నీ తొలగిపోతాయి. దేహాభిమానానికి మమతాసురుడు, కుండలినికి సూచనగా నాగ వాహనం కనిపిస్తాయి.

ధూమ్రవర్ణుడు



అరిషడ్వర్గాలు అయిపోయాయి, దేహాభిమానమూ తీరిపోయింది. ఇక 'నేను' అనే అహంకారం ఒక్కటే మిగిలింది. దానికి సూచనే అహంకారాసురుడనే రాక్షసుడు. ధూమ్రము అంటే పొగ అన్న అర్థం కూడా వస్తుంది. ధూమ్రానికి ఒక ఆకారం అంటూ ఉండదు. ఒక పరిమితీ ఉండదు. సర్వవ్యాపి అయిన ఆ భగవంతుని ప్రతిరూపం ధూమ్రం. మనిషి 'తాను' అనే అహంకారాన్ని వీడి ఆ భగవంతునిలో ఐక్యం కావడానికి సూచనే ఈ అహంకారాసురుని వృత్తాంతం. 'నేను' అనే అహంకారాన్ని పక్కనపెట్టి తనను తాను తెలుసుకునే ప్రయత్నం చేస్తూ పరులకు ఉపకారం చేస్తూ దైవ చింతనతో దైవాన్ని వెతుకుతూ మోక్షంకోసం సాధన చేయడమే దీని సారాంశం.





